క్లుప్తంగా

కేవీలో ఫుడ్ ఫెస్టివల్



మచిలీపట్నంటౌన్: నగరంలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఏడవ తరగతి విద్యార్థులు మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఫెస్టివల్‌లో పలు వంటకాలు తయారు చేసిన విద్యార్థులను ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ మెచ్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పలు వంటకాలను ఎంతో రుచికరంగా తయారు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష తులసీ పూజ



అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామికి మంగళవారం లక్ష తులసీ పూజను ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం లక్ష తులసీ పూజ జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు దీవి రఘునాథాచార్యులు పూజా కార్యక్రమాలు జరిపించారు.

రావివారిపాలెంలో రైతులతో ముఖాముఖి



రావివారిపాలెం(మోపిదేవి): రైతుల అభిప్రాయాలు వ్యవసాయ శాఖలోని విద్యార్థులకు బాగా ఉపకరిస్తాయని మండల వ్యవసాయాధికారి కె. హెప్సిబా రాణి అన్నారు. మండలంలోని రావివారిపాలెంలో మంగళవారం రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆర్గానిక్ పంటలు, పురుగు మందుల వాడకం వంటివి వివరించారు. అనంతరం గ్రామంలో బీపీటీ 5204 పొలాన్ని పరిశీలించారు. పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ రావి రాంప్రసాద్, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొక్కిలిగడ్డలో గ్రామసభ



కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ హరిబాబునాయక్ మాట్లాడుతూ గ్రామంలో గుర్తింపబడిన పనుల వివరాలు సభకు తెలియజేసి అభ్యంతరాలు కోరారు. గ్రామ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన మినీ గోకులాల నిర్మాణాలు ప్రారంభించి, త్వరితగతిన పూర్తయ్యేలా చూడాల్సిందిగా ఉపాధి హామీ సిబ్బందిని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణి, కార్యదర్శి వాకా రవికుమార్, సచివాలయ, ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిన్నారులు, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు

- రోడ్డు ప్రమాదాలు నివారించాలి
- చల్లపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ గంగాధరరావు



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

చల్లపల్లి(అవనిగడ్డ): చిన్నారులు, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు పేర్కొన్నారు. స్థానిక చల్లపల్లి పోలీస్ స్టేషన్, సీఐ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్ కేసులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఆటో, లారీ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. తొలుత ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత అంశాలను పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు పరిశీలించి, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమన్లు, నాన్ బెయిల్ వారెంట్లు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని, కేసులకు సంబంధించి ఇంకా అరెస్ట్‌లు చేయకపోతే వెంటనే అరెస్ట్‌లు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను మరింత పెంపొందించేలా నడచుకోవాలన్నారు. డీఎస్పీ మురళీధర్, సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

అకస్మాత్తుగా వర్షం.. అన్నదాతకు అగచాట్లు


కొంకేపూడి డ్రెయిన్ పక్కన కుప్పగా పోసిన రాసిని కప్పుతున్న రైతులు

ఆరుగాలం కష్టపడి పండిన పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ బాగా పండిందన్న సంతోషంతో కల్లాల్లో నుంచి ఒడ్డున చేర్చుకున్న వడ్లను కాస్తా వరుణుడు తడిపేయడంతో అన్నదాతల అగచాట్లు అన్ని ఇన్ని కావు. మంగళవారం ఉదయం అకస్మాత్తుగా వర్షం పడింది. దీంతో రైతులు పరుగులు పెట్టి ఒడ్డుకు చేర్చిన పంటపై పరదాలు కప్పారు. వర్షం తెరపియగానే కొందరు వడ్లను కాటాల్లో పెట్టి ఆగమేఘాలపై ఇళ్లకు తరలించారు. - పెడన


కట్లపల్లి సమీపంలో వడ్లపై పరదా కప్పి వర్షం నీరు పక్క నుంచి పోయేలా చేస్తున్న రైతు


కూడూరు గ్రామంలో వర్షానికి చెమ్మగిల్లిన ధాన్యం బస్తాలు


కొంకేపూడి మిల్లు వద్ద హడావుడిగా ధాన్యం కాటా పెట్టి బస్తాలకు ఎత్తుతున్న కూలీలు

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కోడూరు: గ్రంథాలయ వారోత్సవాలను గురువారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి పుష్పలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన బాలల దినోత్సవ వేడుకలతో వారోత్సవాలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న నేతల గురించి ఉపన్యాసాలు, 17న విద్యార్థులకు చిత్రలేఖనం, దేశభక్తి గీతాల పోటీలు, 18న జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు, 19న మహిళలకు ముగ్గుల పోటీలు, 20న ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. కార్తిక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని సామూహిక వ్రతాలు, పూజలు చేశారు. ఆలయ అర్చకుడు దీవి నరసింహమూర్తి, పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో వ్రతాలు నిర్వహించారు. ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నేడు కార్తిక దీపోత్సవం

గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మాధవస్వామి ఆలయంలో బుధవారం కార్తిక దీపోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కె.ఎన్. కిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని అర్చక స్వామి గంజాం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా క్షీరాబ్ధి ద్వాదశ వ్రత పూజ, దీపోత్సవం జరుగుతుందని ఆయన వెల్లడించారు.

ఘనంగా దీపోత్సవం



కోడూరు: కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో కార్తిక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో శంఖు, చక్ర, నామాలతో రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం కార్తిక దీపాలు వెలిగించారు.

కార్తిక స్నానాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

సాక్షి ఎఫెక్ట్

కోడూరు: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని హంసలదీవి సాగరతీరంలో కార్తిక స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. సాగరతీరంలో పౌర్ణమి స్నానాల ఏర్పాట్లపై కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదంటూ 'సాగరతీరంలో పౌర్ణమి స్నానాలపై నీలినీడలు' శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు హుటాహుటిన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చే భక్తులు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలని పోలీసులు కోరారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో సముద్రంలో మరబోట్లు, గజఈతగాళ్లతో భద్రత కల్పించనున్నట్లు ఎఫ్‌డీఓ వానపల్లి సత్యన్నారాయణ చెప్పారు. ఈఓపీఆర్డీ నాగరేవతి, కార్యదర్శి లీలాప్రియాంక, డీటీ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపారాధనలు

మోపిదేవి: కార్తిక మాసం సందర్భంగా మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం కార్తిక దీపాలు వెలిగించారు. ఉదయం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి భక్తి భావాన్ని చాటుకున్నారు. అనంతరం స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మహిళ జీవన ప్రమాణాల పెంపునకు కృషి

కలెక్టర్ డీకే బాలాజీ


సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ బాలాజీ

కోనేరుసెంటర్: స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కల్పించి వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. మచిలీపట్నం మండలం మహిళా సమాఖ్య కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను ఓపెన్ నెట్వర్క్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ప్లాట్ ఫామ్‌లో రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ ఎంత వరకు వచ్చిందో ఆరా తీశారు. మొత్తం 1,111 ఉత్పత్తులు నమోదు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 359 ఉత్పత్తులను ఓఎన్‌డీసీలో నమోదు చేశామని డీపీఎం (లివ్లీ హుడ్) కనకారావు కలెక్టర్‌కు వివరించారు. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రెండు రోజుల్లో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణం


సామూహిక హనుమాన్ పూజ చేస్తున్న మహిళలు

రేమాలవారిపాలెం(నాగాయలంక): స్థానిక శ్రీ సువర్చలా సమేత శ్రీభక్తాంజనేయస్వామి, సీతారామచంద్రుల ఆలయ ప్రాంగణంలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం వైభవంగా నిర్వహించారు. గత 20 ఏళ్లుగా ప్రతీ మంగళవారం చాలీసా పారాయణం, హనుమాన్ పూజ నిరంతరాయంగా కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. కార్తిక ఏకాదశి సందర్భంగా గ్రామంలోని జైహనుమాన్ భక్త సేవా సమాజం సభ్యుల నేతృత్వంలో పూజా క్రతువును ప్రారంభించారు. ఎమ్మెల్యే తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్ సందర్శించి పూజ తిలకించారు. ముందుగా శ్రీఆంజనేయస్వామి, శ్రీసీతారామచంద్రుల స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కార్తిక వన భోజనాలు ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్


పెడన పట్టణం సచివాలయం-2 పరిధిలో జియో ట్యాగింగ్ చేస్తున్న సిబ్బంది

పెడన: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఆ ఇంటిలోని ఒక సభ్యుడిని జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ఇంటి డోర్ నెంబరు, ఒక కుటుంబసభ్యుడి పేరు, ఐరిష్(కండ్లను స్కాన్) చేస్తూ వివరాలను నమోదు చేసుకుంటున్నారు. పెడన పట్టణంలో 10,885 ఇళ్లకు గానూ 3,258 ఇళ్లను జియో ట్యాగింగ్ చేశారు. పెడన రూరల్‌లో 12,575 గానూ 1,966 అయ్యాయి. బంటుమిల్లిలో 15,946కు 1,600 మాత్రమే అయ్యాయి. కృత్తివెన్ను మండలంలో 16,768 గానూ 2,410 ఇళ్లను ట్యాగింగ్ చేశారు. గూడూరు మండలంలో 17,797 గానూ 3,616 చేశారు. మిగిలిన ఇళ్లను కూడా త్వరితగతిన చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడంతో సిబ్బంది తలమునకలయ్యారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు


నాగాయలంక కన్యకాంబ ఆలయంలో శ్రీనగరేశ్వరస్వామి

నాగాయలంక: కార్తిక శుద్ధ ఏకాదశి సందర్భంగా మంగళవారం మండలంలోని పలు శివాలయాల్లో విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు జరిగాయి. స్థానిక శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు గంధం, తిరునామం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో నగరేశ్వరునికి 11 రుద్రాలతో కూడిన పంచామృతాలు, వట్టి వేళ్లు, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, పూజలు జరిపారు. గ్రామంలోని పురాతన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భావదేవరపల్లిలో బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో అభిషేకాలు, చందనాలంకారం చేశారు.

బస్సు సర్వీసు పొడిగించాలని వినతి


కొనకళ్లకు వినతిపత్రం అందజేస్తున్న సమ్మెట చంద్రశేఖర్ తదితరులు

గూడూరు: విజయవాడ నుంచి డోకిపర్రు వరకు నడుస్తున్న 333డీ బస్సు సర్వీసును గూడూరు మండలం ముక్కొలు, గురిజేపల్లి, కంకటావ, శారదాయిపేట వరకు పొడిగించాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు మంగళవారం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. సమ్మెట చంద్రశేఖర్, బడే శివకృష్ణ, సమ్మెట సుబ్బారావుల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజలు విజయవాడలోని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల ఛాంబర్‌లో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం డోకిపర్రు వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు నడుస్తున్న బస్సును గూడూరు మండలం శారదాయిపేట సెంటరు వరకు కొనసాగించడం ద్వారా గూడూరు మండలంలోని ముక్కొల్లు, నాగవరం, కలపటం, గురిజేపల్లి, కంకటావ, లేళ్లగరువు, ఆర్‌వి.పల్లి, నారికేడాలపాలెం, ఆకులమన్నాడు తదితర గ్రామాల ప్రజలు సులువుగా విజయవాడ వెళ్లడానికి అవకాశం లభిస్తుందని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ 333డీ బస్సు సర్వీసును కంకటావ వరకు కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని వారు వెల్లడించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై శిక్షణ

గూడూరు: గూడూరు మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు డి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వీఏఏలు గోనె సంచుల సరఫరా బాధ్యత తీసుకుని చిన్న రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వీఆర్‌ఓలు కస్టోడియన్ అధికారులుగా మిల్లుల దగ్గర ధాన్యం దిగుబడి ఆలస్యం కాకుండా పర్యవేక్షించాలన్నారు. సాంకేతిక సిబ్బంది రైతుల నుంచి శాంపిల్స్ స్వీకరణలో అలసత్వం లేకుండా నిబంధనల ప్రకారం నడుచుకోవాలని కోరారు. ఆయా విభాగాల్లోని వారంతా సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు రాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె. ఆంజనేయకుమార్, వీఆర్వోలు, వీఏఏలు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కోనేరుసెంటర్: యువతి అదృశ్యంపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మచిలీపట్నం ఆనందపేటకు చెందిన ఓ యువతి (17) ఇంటర్ చదువుతోంది. సోమవారం సాయంత్రం సదరు యువతి ఇంటి నుంచి బయటికి వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. యువతి ఆచూకీ లభించకపోవడంతో తల్లి గుమ్మడి శోభారాణి ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కలంకారీ కళాకారులకు శిక్షణ

గూడూరు: హాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కమిషనర్ సౌజన్యంతో మండలంలోని కప్పలదొడ్డిలోని కళాకారులకు కలంకారీలో సహజ రంగుల వినియోగంపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా అరటిపళ్లు, కరక్కాయ పువ్వు, సున్నం, బ్లూ కేక్, పటిక కలిపి రెండు రకాల ఇండిగో బ్లూ, పసుపు రంగులు సహజసిద్ధంగా తయారు చేయు విధానంపై కళాకారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హాండీ క్రాఫ్ట్స్ విభాగం అధికారి షరీఫ్ మాట్లాడుతూ కొత్తగా కలంకారీ నేర్చుకునే వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. కలంకారీ కళాకారులకు ప్రభుత్వం జారీ చేస్తున్న ఆర్టిసన్ కార్డులపై అవగాహన కల్పించారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ సుదర్శన నారసింహ యజ్ఞం

బంటుమిల్లి: పెద్దాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీసువర్చలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం హనుమత్ సుదర్శన నారసింహ యజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పవిత్ర జలాలతో అభిషేకాలు జరిగాయి. నారసింహ యజ్ఞం, మహాలక్ష్మి ఆరాధన యజ్ఞం, త్రైలోకి మండపారాధన తదితర పూజలు వైభవంగా నిర్వహించారు.

నాగాభరణధారికి నవ హారతుల సౌభాగ్యం


శ్రీరామలింగేశ్వరునికి నక్షత్ర హారతి సమర్పిస్తున్న పండితులు

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం వద్ద కార్తిక శుద్ధ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం రాత్రి రామలింగేశ్వరస్వామి మండపంలో శివయ్యకు ప్రత్యేక నాగాభరణం అలంకరించి అంగరంగ వైభవంగా సమర్పించిన నవ హారతులతో భక్తజనం పులకితులయ్యారు. నాగాభరణధారి శివలింగానికి విశేష పూజలు జరిపిన ఉభయదాతలు పాతూరి వెంకటేశ్వరరావు, శకుంతల దంపతులు కోటి వత్తుల దీప స్తంభానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం బ్రహ్మశ్రీ అంబా సాయి కిరణ్ శర్మ బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా సాగింది. బ్రహ్మశ్రీ శిష్టాల సుబ్రహ్మణ్యశాస్త్రి, ముదునూరు అచ్యుత్ శర్మ, నరసింహులు స్వామికి నవ హారతులను నేత్రపర్వంగా సమర్పించారు. మంత్ర పుష్ప నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, తలశిల రఘుశేఖర్ పర్యవేక్షించారు.

ఘనంగా కార్తిక వనసమారాధనలు



కృత్తివెన్ను: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం కార్తిక వనసమారాధనలు ఘనంగా నిర్వహించారు. గాంధీనగరం గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద జరిగిన కార్తిక వనసమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వన భోజనాలు చేశారు. పడతడికలో కూడా కార్తిక వన సమారాధన నిర్వహించారు.

దేవాలయాల వ్యవస్థను కాపాడుకోవాలి

బంటుమిల్లి: రాజకీయ నాయకుల పునరావాస కేంద్రాలుగా మారిన దేవాలయ వ్యవస్థను కాపాడుకునేందుకు హిందువులు ఏకం కావాలని సమర సత సేవా ఫౌండేషన్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ తులసీ సూర్యప్రకాశరావు అన్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో స్థానిక క్రాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేవాలయాల ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జనవరి ఐదో తేదీన విజయవాడలో చేపట్టే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి హిందువూ కదలిరావాలని విజ్ఞప్తి చేశారు.